ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 16.06.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో ఖరీఫ్ సాగు నేపథ్యంలో వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి MCR HRD లో సమీక్ష నిర్వహిస్తున్నారు.

2. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ , పీఎంపీ లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

3. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

4. జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు , రెండవ జాతీయ లోక్ అదాలత్ ను ఈనెల 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు.

**సీఎం రివ్యూ**

రాష్ట్రంలో ఖరీఫ్ సాగు నేపథ్యంలో వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో MCRHRD బోధి పెవిలియన్ లో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు , శ్రీధర్ బాబు , రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సహా పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

డెస్క్

**బండి**

గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ , పీఎంపీ లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా మానకొండూరులో ఆర్ఎంపీ , పీఎంపీలతో కేంద్ర మంత్రి ''చాయ్ పే చర్చ '' కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను , ప్రజల అభివృద్ధి , సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని , తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు.

పిటిసి, కరీంనగర్

**పంటల సాగు**

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మార్క్ ఫెడ్ కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... రైతుభరోసా ను గతంలో మాదిరే అమలు చేస్తామని , నెలాఖరుకు రైతుల ఖాతాల్లో నిధులను జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా పంటల మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.

డెస్క్

**లోక్ అదాలత్**

జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు , రెండవ జాతీయ లోక్ అదాలత్ ను ఈనెల 20 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. హైకోర్టు నుండి తాలూకా స్థాయి వరకు అన్ని న్యాయ స్థానాల్లో ఈ లోక్ అదాలత్ జరుగుతుంది. సివిల్ కేసులు , రాజీపడదగిన క్రిమినల్ కేసులు , పెండింగ్, ప్రీ-లిటిగేషన్ కేసులు అన్నీ ఈ అదాలత్ పరిధిలోకి వస్తాయి. లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కరించుకుంటే, అప్పటి వరకు చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి వస్తుంది.

పీఎన్

**ఎలక్ట్రిసిటీ**

వర్షాకాలంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ విస్తృత సన్నద్ధతా చర్యలు చేపట్టింది. సంస్థ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం హైదరాబాద్‌లో "పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ - వాక్

ఎలాంగ్ ది లైన్" కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ స్తంభాలు , ట్రాన్స్‌ఫార్మర్లు ఇన్సులేటర్లు, కండక్టర్లతో సహా మౌలిక సదుపాయాలన్నింటినీ ప్రత్యక్షంగా పరిశీలించారు.

డెస్క్

**ఏసీబీ**

ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసంలో ఈ ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఛత్రినాకలోని నరహరి నివాసం , కార్యాలయం, బంధువుల ఇళ్లతో పాటు 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. నగదు , బంగారు ఆభరణాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు సోదాలు చేపట్టాయి.

డెస్క్

**యోగా సిరిసిల్ల**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ లో 60 వేల మందితో కోటి సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ ఆరోగ్య మందిర్ వేములవాడ యోగా శిక్షకులు, ఎలిగేటి కృష్ణ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

బైట్ ... కృష్ణ

పిటిసి, సిరిసిల్ల

**స్కూల్ సీఎం**

రంగారెడ్డి జిల్లా , అరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రేపు ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆరుట్లకు ముఖ్యమంత్రి చేరుకుంటారు. పాఠశాల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా ప్రీ-ప్రైమరీ తరగతి గది , గ్రంథాలయం, ఇన్నోవేషన్ లాబ్, సైన్స్ లాబ్, కంప్యూటర్ లాబ్ , క్రీడా మైదానాలను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. ఆ తర్వాత బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

డెస్క్

**యోగా రన్**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "యోగా రన్" ను జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ రవీందర్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని , శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మార్గదర్శిగా పనిచేస్తుందన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంలో యోగ మనకు ప్రశాంతతను , ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి పద్మజ , వైద్యుడు శిల్ప మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**భద్రాద్రి యోగా**

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు , యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా శిక్షకురాలు కొచ్చెర్ల కమలారాణి ఆకాశవాణికి తెలియజేశారు.

బైట్ ... కమలా

పిటిసి, భద్రాద్రి

**ప్రపంచ సముద్ర తాబేలు దినోత్సవం**

ఈరోజు ప్రపంచ సముద్ర తాబేలు దినోత్సవం జరుపుకుంటున్నారు. సముద్ర పర్యావరణ వ్యవస్థను కాపాడటంలో సముద్ర తాబేళ్ల ప్రాముఖ్యతను తెలియజేయడానికి, వాటిని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సముద్ర తాబేళ్లు ఎదుర్కొంటున్న సమస్యలు: ప్లాస్టిక్ కాలుష్యం , వాతావరణ మార్పులు , ఆవాసాలు కోల్పోవడం , చేపల వేటలో అనుకోకుండా చిక్కుకోవడం వల్ల ఇవి అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి.

జీఎస్

**ఆపరేషన్**

ప్రభుత్వ ఆస్పత్రులలో పేద , మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించటానికి ప్రభుత్వం కృషి చేస్తోందని , ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు , సిబ్బంది సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెడతామని హన్మకొండ జిల్లా

వైద్యాధికారి డాక్టర్ దుర్గా రాంకుమార్ పేర్కొన్నారు. గర్భిణీలకు లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పిటిసి, వరంగల్

**మొహర్రం**

మొహరం పండుగ సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. . జిల్లాలోని అశూర్ ఖానాలలో పరిశుభ్రత పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. మొహరం ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

పిటిసి, సిరిసిల్ల

**వర్షాలు**

నిన్న మధ్యాహ్నం నుంచి నల్లగొండ జిల్లాలోని పలు చోట్ల ఓమోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తీగలు తేదీ పడటంతో విద్యుత్ సరఫరాకి కొంతసేపు అంతరాయం కలిగింది

పిటిసి, నల్గొండ

**కలెక్టర్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్య , వైద్య రంగాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఐడీఓసీ కార్యాలయంలో సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ తదితర పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలు , అంగన్వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని కోరారు.

పిటిసి, భద్రాద్రి

**బహుజన సమాజ్ పార్టీ**

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తికి చెందిన బండి పృథ్వీరాజ్ నియామకం అయ్యారు. ఎం.ఫార్మసీ చదివిన ఆయన పార్టీలో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా , రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నారు.

పిటిసి, నాగర్ కర్నూల్

**"ఏక్ పెడ్ మా కే నామ్"**

ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి , దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. "ఏక్ పెడ్ మా కే నామ్ " కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ , బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ , జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ మా కే నామ్ పేరుతో జాతీయ విద్యార్థి

పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

పిటిసి, నల్గొండ

**స్కూల్**

ఆసిఫాబాద్ జిల్లాలోని హిరాపూర్ లో ఏడేళ్ల క్రితం మూతపడిన ప్రభుత్వ పాఠశాలను వార్డు కౌన్సిల్ సాలం బిన్ అహ్మద్ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తెరిపించారు. పాఠశాలను శుభ్రం చేయడంతో పాటు ఉపాధ్యాయులను కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలలో చేరగా జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చితానంద స్వామి , మున్సిపల్ చైర్మన్ ఆకాష్ లు పాఠశాల ప్రారంభించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**లోక్ అదాలత్**

లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వరన్యాయం లభిస్తుందని రాజన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు , పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ , పోలీసు అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 20న జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసుల పరిష్కారమయ్యేలా చూడాలని పోలీసు అధికారు లకు సూచించారు.

పిటిసి, సిరిసిల్ల

**పెద్దపల్లి**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి , అందుబాటులో ఉన్న  నిధులను ఈనెల 30 లోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.

పిటిసి, పెద్దపల్లి

**నిట్**

వరంగల్‌లోని నిట్ పరిశోధకులు మరో ప్రతిష్టాత్మకమైన విజయాన్ని అందుకున్నారు. నేలలో ఆర్గానిక్ కంపనాల ప్రభావంతో ఏర్పడే వికృతిని కచ్చితంగా కొలిచేందుకు ఎఫ్‌బీజీ సెన్సార్ ను ప్రత్యేక పైప్ మెష్ ట్యూబ్‌లో అమర్చే సాంకేతికతను ఆవిష్కరణలో ప్రతిపాదించారు. ఈ వినూత్న ఆవిష్కరణకు భారత ప్రభుత్వం పేటెంట్ నంబరు 591416ను మంజూరు చేసింది. ఈ పరిశోధనను సతీష్‌కుమార్ టంకారా, ఆచార్య సంజిత్ బిస్వాస్, అనిర్బన్, మాజీ ప్రొఫెసర్ సౌరబ్ రాయ్‌తో కూడిన బృందం అభివృద్ధి చేసింది.

పిటిసి, వరంగల్

**బాధ్యతలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా  రెవెన్యూ అధికారిగా గొట్టె జయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేసిన ఆమె డీఆర్వోగా బదిలీ అయ్యారు.

పిటిసి, సిరిసిల్ల

**ఎమ్మెల్యే**

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండలో మున్సిపల్ , మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

పిటిసి, వరంగల్

**తనిఖీలు**

జనగామ లోని పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు , స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్ లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన ఆహార సామాగ్రిని స్వాధీన పరుచుకుని జరిమానాలు విధించారు. ఇలాంటివి పునరావృతం అయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పిటిసి, జనగామ